సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఈ పనులు ఎవరి కోసం...?

•పన్నులు ప్రభుత్వానికి.. వెతలు ప్రజలకు... •చేసిన పనులు చేస్తూ ప్రజాధనం వృథా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

చేసిన పనులను మళ్లీ చేయడం ఎవరికోసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలనే నెపంతో అధికారులు కాంట్రాక్టర్లు ప్రజాప్రతినిధులు అందరూ ఏకమై బాగున్న డివైడర్లను, తీయడం డివైడర్ల మధ్యలో ఉంచిన తెలుగు అక్షరాల స్తంభాలను తీసి వాటి స్థానంలో మళ్లీ డివైడర్లు ఏర్పాటు చేస్తున్నారు. మొక్కలు నాటి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా మార్చి స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంచిర్యాంకును సాధించాలనే తపనతో చేసిన పనులు మళ్లీ చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని నగర పౌరులు చెబుతున్నారు. మంత్రి తమ క్యాంపు కార్యాలయం నుండి ఇంటికి వెళ్లే దారి అందంగా కల్పించాలనే ఉద్దేశంతో డివిఆర్ నుండి చిరంజీవి పార్క్ వరకు ఉన్న డివైడర్లను తీసి రూ.70 లక్షలు ఖర్చు చేసి మళ్లీ డివైడర్లు ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. బంగారు పేట నుండి ఐదు రోడ్ల కూడలి వరకు డివైడర్లను తీసి మళ్లీ డివైడర్లను ఏర్పాటు చేసేందుకు రూ.50 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పర్సంటేజీలు ముట్ట చెబితే కాంట్రాక్టర్లకు బిల్లులు కావడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. శివారు కాలనీలలో కనీసం నడిచేందుకు కంకర రోడ్లు కూడా లేవని, మురుగు కాల్వలు లేక రోడ్లపై వర్షం పడితే రోడ్లపై నీరు నిలిచి ఇంటికి పోలేని పరిస్థితుల్లో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వాటిపై దృష్టి

సారించకుండా మంచిగా ఉండే రోడ్లను పగలగొట్టడం డివైడర్లు వేయడం లాంటి చేయడంతో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నా వాటిని పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ట్రాఫిక్ పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతుంటే రోడ్లను విస్తీర్ణం చేయాల్సిన అధికారులు ఉన్న రోడ్లను ఇరుకు రోడ్లుగా తయారు చేస్తున్నారు. అడుగు విస్తీర్ణంలో ఉన్న సిమెంటు దిమ్మెలను తొలగించి వేసి మూడు అడుగులకు పైగా విస్తీర్ణంతో ఆర్‌సిసి గోడలు నిర్మించడం అవసరమా? అసలు రోడ్లు లేని శివారు ప్రాంతాల్లో రోడ్లు వేయండి వర్షం వస్తే అడుగుదీసి అడుగు పెట్టలేకపోతున్నారు. కాలువలు నిర్మించండి అని ప్రజలు ఆందోళన చేసి అర్జీలు ఇచ్చి ఆఫీసులో చుట్టూ తిరుగుతా ఉంటే అవేమీ పట్టనట్లు ప్రజా ప్రతినిధులు చెప్పినట్లుగా తల ఊపుతూ అధికారులు ఉన్న రోడ్లను కూలగొట్టడం పెద్ద రోడ్లను చిన్నగా చేయడం గురించి ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇందుకేనా ఇంటి పన్నులు పెంచడం? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు కనీస అవసరమైనటువంటి తాగునీరు ,వీధిలైట్లు, నడిచేందుకు వీలుగా రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటుచేసి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సుందరీకరణ కోసం కొత్త డివైడర్లు

- మున్సిపల్ కార్పొరేషన్ డిఇ నరేష్

సుందరీకరణ కోసం కొత్త డివైడర్లు ఏర్పాటు చేస్తున్నాం. పాత డివైడర్లు ఒక అడుగు ఉన్నాయి. ఒకటిన్నర అడుగు పెంచుతున్నాం. ప్రజాధనం వృథా కోసం కాదు. గ్రీనరీ పెంచడానికే ఈ ప్రయత్నం.

డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ట్రిపుల్ ఐటిడిఎం విద్యా సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన క్యాంపు కార్యాలయంలో ట్రిపుల్ ఐటిడిఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్య సదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఘటనా స్థలంలోనూ, ఆసుపత్రికి వెళ్తున్న సమయంలోను రోగుల పరిస్థితిని వైద్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి, వైద్య సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ వ్యవస్థ వైద్యులు, ఆసుపత్రుల మధ్య రియల్ టైం కమ్యూనికేషన్ నెట్వర్క్ ఏర్పరుస్తుందన్నారు. అత్యవసర హెచ్చరికలు, గ్రీన్ ఛానల్ సమయంలో అంబులెన్స్‌కు రూట్ క్లియర్ చేసేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. కర్నూలు ట్రిపుల్ ఐటి డిఎం ప్రొఫెసర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రదర్శనను పరిశీలించి, త్వరలోనే పూర్తిస్థాయిలో ఈ వ్యవస్థను రూపొందించాలని కలెక్టర్ ట్రిపుల్ ఐటిడిఎం అధికారులను ఆదేశించారు. ట్రిపుల్ ఐటీ డిఎం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె కృష్ణ నాయక్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ , విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లను అప్లోడ్ చేయాలి

జిల్లాలోని ఆయా శాఖల కార్యాలయాలకు చెందిన డాక్యుమెంట్లను అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ జిల్లా అధికారులతో, తహశీల్దార్లతో, ఎంపిడిఒలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాలకు సంబంధించిన చట్టాలు, నియమ నిబంధనలు, కోర్ ఆర్డర్లు, మెమోలు, జిఒలు, సర్క్యులర్లు, ప్రొసీడింగులు తదితర ముఖ్యమైన డాక్యుమెంట్లు స్కానింగ్ చేసి ఇటిపిఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. తహసీల్దార్లు, ఎంపిడిఒలు కూడా తమ కార్యాలయాల డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలన్నారు. రియల్ టైం గవర్నెన్స్ లో ఈ ప్రక్రియను నిర్వహించడం జరుగుతోందని, అన్ని శాఖల అధికారులు మూడు రోజుల లోపు డాక్యుమెంట్లు అప్లోడ్ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ అంశం పురోగతిపై పర్యవేక్షించాలని కలెక్టర్ డిఆర్‌ఒను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి

-కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ఎన్నికల కమిషన్ బిజెపి అడుగులకు మడుగులు వత్తే విధంగా ఎస్ఐఆర్ పేరుతో ప్రజాస్వామ్యయుతమైన ఓట్లను తొలగించడంతోపాటు అక్రమ ఓట్లను చేర్చే ప్రక్రియకు తెరలేపిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.రాముడు, ఎండి. ఆనంద్‌బాబు, జి.రామకృష్ణ, ఎండి.అంజిబాబు మాట్లాడారు. బీహార్లో జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కమిషన్ బాగోతం బయటపడిందన్నారు. ఒక్కసారిగా రూ.65 లక్షల ఓట్లు తీసివేయడం బిజెపి కుయుక్తులకు అనుగుణంగా పనిచేయడమే అన్నారు. ఒక రాష్ట్రంలో ఉన్న ఓట్లు మరో రాష్ట్రంలో తమకు అనుకూలమైన వారివి ఎక్కించుకోవడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యయుతంగా పనిచేయాల్సిన రాజ్యాంగ వ్యవస్థలన్నింటిని తమ తాబేదారులతో నింపుకుంటుందన్నారు. ముస్లింలు గిరిజనులు దళితులు ప్రజాస్వామ్యవాదుల ఏరివేతలో భాగంగా తాము గతంలో అమలు చేస్తామన్న ఎన్ఆర్‌సి, సిఎఎలను దొడ్డి దారిన అమలు చేయించే ప్రయత్నం చేస్తుందన్నారు. బీహార్ ఓటర్ లిస్టులలో ఒక్కసారిగా మూకుమ్మడి తొలగింపులపై దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకొని ఆగస్టు 9 నాటికి వివరాలు అందించాలన్నారని తెలిపారు. సామూహిక చేర్పింపులు ఉంటాయని, సామూహిక తొలగింపులు ఏమిటని, 65 లక్షల ఓటర్లు చనిపోయారా వలస వెళ్లారా అన్న ఎలాంటి వివరణ లేకుండానే తీసేయడం ఏమి సూచిస్తుందని మొట్టికాయ వేసిందన్నారు. బాధ్యతా రహితంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషన్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్, నగేష్, విజయ్ నగర కార్యదర్శివర్గ సభ్యులు సాయిబాబా నరసింహులు సుధాకరప్ప ప్రభాకర్ షరీఫ్ అబ్దుల్ దేశాయ్ రామకృష్ణ మహిళా నాయకులు పద్మ, వేణి మరో వంద మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుబంధానికి సంకేతం..

ఆత్మీయతకు సందేశం...

నేడు రాఖీ పండుగ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

రాఖీ పండుగ సోదర, సోదరీమణుల మధ్య అనుబంధాన్ని గుర్తు చేసుకునే సందర్భం. సోదరుడు తన సోదరితో రాఖీ కట్టించుకుని ఆమె రక్షణకోసం హామీ ఇస్తారు. కానుకలూ బహూకరిస్తారు. అయితే సోదరికి సంప్రదాయ కానుకలు ఇవ్వడం తోనే సరిపెట్టుకోవద్దు. తనకు భరోసాను అందించేలా ఆర్థిక కానుకలు ఇవ్వడం ద్వారా భవిష్యత్తు భరోకు భరోసా కల్పించొచ్చు. అయితే కొందరిని రాఖీ పండుగ ఎందుకు చేస్తారంటే అందరూ చేసుకుంటున్నారు. మేము చేసుకుంటున్నాం. అనేవారున్నారు. అదంతా మనకెందుకు రూ.20 రాఖీ కడితే మాఅన్న లేదా మాతమ్ముడు ఎంతోకొంత ఇస్తారులే అనుకునేవారున్నారు. ఈ నేపథ్యంలో దీని పూర్వపరాలతో ప్రజాశక్తి ప్రత్యేక కథనం....

నిజానికి, భారతదేశంలో రాఖీపౌర్ణమి లేదా రక్షాబంధన్ ఎప్పుడు ప్రారంభమైందో, ఎలా ప్రారంభమైందో తెలిపే నిర్దిష్ట సాక్ష్యదారాలు లేవు. కానీ, పురాణాలలో, చరిత్రలో కథలున్నాయి. ఆ ఉదాహరణలను పరిశీలిద్దాం... ఒక చారిత్రక కథ ద్వారా ...

అలెగ్జాండర్ భార్య పురుషోత్తముడి కథ: చరిత్రపుటల్లో అలెగ్జాండర్ భార్య 'రొక్సానా' తక్షశిల రాజు పురుషోత్తముడిని తన సోదరుడిగా భావించి రాఖీ కడుతుంది. జగజ్జేతగా మారాలనే తపనతో గ్రీకు యువరాజు అలెగ్జాండర్ క్రీస్తు పూర్వం 326లో భారత దేశంపై దండెత్తుతాడు. ఆ క్రమంలో బాక్ట్రియా (నేటి ఆఫ్ఘనిస్థాన్)కు చెందిన యువరాణి రొక్సానాను వివాహం చేసుకుంటాడు. ఆమె వివాహసంబంధాన్ని ఉపయోగించుకుని మధ్య ఆసియా దేశాలను, ముఖ్యంగా జీలం, చినాబ్ నదుల మధ్య ఉన్న రాజ్యాలను జయించాలని అలెగ్జాండర్ ఆలోచన. అలెగ్జాండర్ యుద్ధం ప్రకటిస్తాడు. పురుషోత్తముడి శత్రు రాజు అంబి, అలెగ్జాండర్‌ను భారతదేశంపై దండెత్తాలని ఆహ్వానిస్తాడు. పురుషోత్తముడు యుద్ధానికి సిద్ధమవుతాడు. అయితే అలెగ్జాండర్ భార్య రొక్సానా పురుషోత్తముడిని తన అన్నలా భావించి రాఖీ కడుతుంది. తన సోదరుడిని చంపవద్దని తన భర్త అయిన అలెగ్జాండర్‌ను కోరుతుంది. దీంతో అలెగ్జాండర్ యుద్ధం విరమించుకుంటాడు. మరో పురాతన కథ నేపథ్యం ఈవిధంగ ఉంది. పురాణాల ఆధారంగా రెండు, మూడు వేర్వేరు సందర్భాలున్నాయి. అంత సమయం లేదు మిత్రమా....

హిందూ సాంప్రదాయం ప్రకారం, శ్రావణమాసంలో రాఖీ-పౌర్ణమి జరుపుకుంటారు. ఉత్తర భారదేశంలో రాఖీ-పౌర్ణమిని రక్షాబంధన్ గా పేర్కొంటారు. సోదరి తన సోదరుడికి పూర్తి సంవత్సరం విజయం చేకూరాలని రాఖీ కడుతుంది. రాఖీ కట్టిన సోదరికి జీవితాంతం రక్షగా ఉంటానని సోదరుడు భావించే పండుగ. హిందు సాంప్రదాయం ప్రకారం, శ్రావణమాసంలో (జులై -ఆగష్టు మధ్య) పౌర్ణమి రోజున ఈ పండుగను మన దేశవ్యాప్తంగా, సోదరులు , సోదరీమణులు మధ్య ప్రేమ , ఆప్యాయతకు గుర్తుగా జరుపుకుంటారు. ఉత్తర భారదేశంలో ఈ పండుగను రక్షాబంధన్ అని పిలుస్తారు. రక్షా-రక్షణ అని, బంధన్-బంధం అని అర్థం. ఈ రోజున సోదరి, సోదరుడికి రంగు రంగుల రాఖీని కడుతుంది. దీనికర్థం- ఈ సంవత్సరం మొత్తం సోదరుడికి విజయం, శాంతి మరియు మంచి ఆరోగ్యం చేకూరాలను ఆశిస్తూ రాఖీని కడుతుంది. అదేవిధంగా, సోదరుడు రాఖీ కట్టిన చెల్లిని ఏ సమస్యలు రాకుండా, జీవితాంతం రక్షగా ఉంటానని భావించే పండుగగా రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు. అయితే మతాల కతీతంగా కూడా కొన్ని చోట్ల జరుపుకుంటున్నారు.

కర్నూలు ఎంపీకి రాఖీ కడుతున్న నంద్యాల ఎంపీ

కర్నూలు ఎంపీకి రాఖీ కట్టిన నంద్యాల ఎంపీ

రాఖీ పౌర్ణమిని పురష్కరించుకొని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి రాఖీ కట్టారు. ఢిల్లీలోని పార్లమెంటులో శుక్రవారం ఎంపీ నాగరాజుకు ఆమె రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శబరి ఎప్పుడూ ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని నాగరాజు ఆకాంక్షించారు.

బాలునితో కిమ్స్ వైద్యులు

పదేళ్ల బాలుడికి అరుదైన శస్త్రచికిత్స

కిమ్స్ వైద్యుల ఫ్రేస్ ప్రొసీజర్‌తో నొప్పి తగ్గింపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పిల్లల్లో అరుదుగా కనిపించే క్రానిక్ కాల్సిఫిక్ పాంక్రియాటైటిస్ వ్యాధితో బాధపడుతున్న పదేళ్ల రితిక్ అనే బాలుడిపై కిమ్స్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా ఫ్రేస్ ప్రొసీజర్ శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ వ్యాధి దక్షిణ భారతదేశంలో ప్రతి లక్షమంది పిల్లల్లో కేవలం 126 మందికే (0.126శాతం) వస్తుందని వైద్యులు తెలిపారు. రితిక్‌కు ఐదేళ్ల వయసు నుంచే క్లోమం (పాంక్రియాస్)లో అధిక సంఖ్యలో రాళ్లు ఏర్పడటం ప్రారంభమైంది. దీని కారణంగా పాంక్రియాస్ పైపు ఉబ్బిపోవడం, తరచూ తీవ్రమైన కడుపు నొప్పి రావడం జరిగేది. పలువురు వైద్యులు హైదరాబాదులో చికిత్స చేయమని సూచించగా, తల్లిదండ్రులు కర్నూలు కిమ్స్ ఆస్పత్రిని ఆశ్రయించారు. ఆస్పత్రి కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎస్‌జె. జానకిరామ్, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ఎం.శ్రీకాంతబాబు సంయుక్తంగా ఈ శస్త్రచికిత్స నిర్వహించారు. ముందుగా ఎంఆర్‌ఐ ద్వారా లోపలి పరిస్థితి పూర్తిగా గుర్తించి, రాళ్లను తొలగించడం, ఉబ్బిన పైపు సరిచేయడం, అవసరమైన కణజాలం , చిన్న పేగు భాగాన్ని కత్తిరించి మళ్లీ కుట్టడం వంటి చర్యలు చేపట్టారు. వైద్యుల ప్రకారం, ఈ శస్త్రచికిత్సతో రితిక్‌కు నొప్పి పూర్తిగా తగ్గిపోతుంది. అయితే క్లోమ పనితీరు తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో మధుమేహం వచ్చే అవకాశం ఉండటంతో పాటు, నూనె పదార్థాలు తిన్న తర్వాత ఆయిల్ స్టూల్స్ వచ్చే ప్రమాదం ఉందని, అందుకు తగిన మందులు ఇచ్చినట్లు తెలిపారు. ఇలాంటి క్లిష్టమైన చికిత్సలు సాధారణంగా హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో మాత్రమే లభ్యమవుతుండగా, ఇప్పుడు కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలోనే అన్ని విభాగాల నిపుణులు, ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉండటంతో రాయలసీమ రోగులకు ప్రయోజనం కలుగుతోందని వైద్యులు తెలిపారు.

ఇంటింటికి కరపత్రాలు పంచిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు పట్టణంలో ఎస్‌సి కాలనీ ఒకటో వార్డ్ 229 బూతు నంబర్లో డోర్ టు డోర్ కార్యక్రమం మాల మునిస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు భరోసా పథకం ద్వారా 200 యూనిట్ల కరెంటు ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.15000 భారం తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాల మునుస్వామి, మాల రామకృష్ణ ,మాల కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలి

కలెక్టర్ పి రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని, అంకితభావంతో దేశాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం సాయంకాలం కలెక్టరేట్ గాంధీ విగ్రహం దగ్గర నిర్వహించిన హర్ ఘర్ తిరంగా క్యాండిల్ లైట్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తన సతీమణితో కలిసి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులు మువ్వన్నెల జెండా చేత బట్టి, కొవ్వొత్తుల వెలుగుతో దేశభక్తి నినాదాలు చేశారు.. జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ...కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటి పై మువ్వన్నెల జండా) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ప్రతి భారతీయుడు తమ ఇళ్ల పైన జాతీయ జెండాను గర్వంగా ఎగురవేసి వారిలో దేశ భక్తి పెంపొందించాలని తెలిపారు. మన దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వం గురించి తెలుసుకోవడం ద్వారా దేశం పట్ల గౌరవం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. జాతీయ జెండా, జాతీయ గీతం వంటి జాతీయ చిహ్నాలను గౌరవించడం దేశభక్తికి చిహ్నం అని విద్యార్థులకు తెలిపారు. క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా మెలగడం కూడా దేశభక్తిలో భాగమే అన్నారు. విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించడానికి పాఠశాలలు, కుటుంబాలు , సమాజం కృషి చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్ రంజిత్‌బాషా సతామణితో కలిసి క్యాండిలైటింగ్ ప్రదర్శన

ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే చర్యలు

పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్

ప్రజాశక్తి-పత్తికొండ

చెరువులకు సంబంధించిన పైప్ లైన్ ,వాల్స్‌కు సంబంధించిన ఆస్తులపై ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ అన్నారు. శుక్రవారం పత్రిక విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం లోని హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా 68 చెరువులకు నీరు సరఫరా పైప్ లైన్ కు ఎటువంటి నష్టం వాటిల్లకుండా రైతులు చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చెరువు నిండితే భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. పశువులకు తాగునీటి ఇబ్బందులు రావని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

-మీ డబ్బు, మీ భద్రత-జాగ్రత్తగా వ్యవహరించండి

-ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

ఇటీవల మార్కెట్ మాస్టర్, హెచ్‌యుజిఇ, షేర్‌బూస్టర్, క్విక్‌ప్రాఫిట్, స్టాక్ విజర్డ్, వంటి పెట్టుబడి యాప్ లు, సోషల్ మీడియా, టెలిగ్రామ్ గ్రూపులు, వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను సైబర్ నేరగాళ్ళ మోసం చేస్తున్న ఘటనలు జిల్లాలో ఇటీవల వెలుగులోకి వచ్చాయని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం తెలిపారు. అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిస్తూ ఈ యాప్‌ల ద్వారా లక్షల రూపాయలు వసూలు చేసి అనంతరం మూసివేస్తున్నారు.

మోసం చేసే విధానం: యాప్ ల ద్వారా '100శాతం లాభం, రోజుకి 3-5శాతం రిటర్న్స్' వంటి వాగ్దానాలు. మొదట్లో చిన్న మొత్తాలపై లాభాలు చూపించి నమ్మకాన్ని కల్పిస్తారన్నారు. ఆ పై పెద్ద మొత్తాలను డిపాజిట్ చేయమని ఒత్తిడి చేస్తారన్నారు. డబ్బు పంపిన తరువాత యాప్ లేదా వెబ్సైట్ పనిచేయవన్నారు. మోసగాళ్లు విదేశీ నంబర్లు, ఫేక్ కెవైసి డాక్యుమెంట్లు ఉపయోగిస్తారన్నారు.

ఎస్‌పి సూచనలు: పెట్టుబడులు చేసే ముందు సంబంధిత కంపెనీ లేదా యాప్ సెబి, ఆర్‌బిఐ గుర్తించిందా అనే దాని పై పరిశీలించాలి. '100శాతం లాభం, నష్టమేం ఉండదు' వంటి ప్రకటనలు మోసపూరితం.

టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే పెట్టుబడి సూచనలను పూర్తిగా నమ్మవద్దు. ఎటువంటి అనధికారిక లింకులు లేదా యాప్‌లలో డబ్బులు ట్రాన్స్ఫర్ చేయవద్దు.

ఉదాహరణ1: కర్నూలు నగరానికి షేర్‌బూస్టర్ అనే యాప్ ద్వారా రూ. 1 లక్ష 20 వేలు పెట్టుబడి పెట్టింది. టెలిగ్రామ్ గ్రూపు ద్వారా ఒక బ్రోకర్ సూచనలతో డిపాజిట్ చేసిన తర్వాత యాప్ ఎర్రర్ చూపించడంతో మోసపోయారు.

ఉదాహరణ2: కర్నూలుకు చెందిన ఒక మహిళ హెచ్‌యుజి అనే యాప్ ద్వారా రూ. 90 వేలు పెట్టుబడి పెట్టింది. స్పెషల్ ప్లాన్ ద్వారా నెల రోజుల్లో డబుల్ అవుతుందని చెప్పి డబ్బు వసూలు చేశారు. అనంతరం యాప్ మూసివేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక వేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైమ్ 1930 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. అదేవిధంగా www.cybercrime.gov.in ఫిర్యాదు చేయాలి. ఈ తరహా మోసాల పై అప్రమత్తంగా ఉండండని, ఇతరులకు కూడా ఈ విషయాలను తెలియజేయాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతుంటారన్నారు. కాబట్టి ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

వైసిపి దళిత వ్యతిరేకి

-అధికారంలో ఉన్నామనే భ్రమలోనే వైసిపి నేతల దాడులు

-టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆరోపణ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

దళిత వ్యతిరేక పార్టీ వైసిపి అని, అందుకు దళితులపై ఆ పార్టీ నేతలు చేస్తున్న దాడులే నిదర్శమని కర్నూలు టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి అన్నారు. తిరుపతిలో వైసిపి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబ ఆధ్వర్యంలో కొంతమంది దుండగులు ఓ దళిత యువకున్ని నిర్బంధించి దాడి చేసి న ఘటనపై ఆయన శుక్రవారం మీడియాతో స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వారికి ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పి ఇంట్లోకూర్చోబెట్టినా వారికింకా బుద్ధిరాలేదనీ ఇంకా అధికారంలో ఉన్నామన్న భ్రమలోనే దళితులపై ఇంకా దాడులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ దాడి చేయడమే కాకుండా వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయడం సిగ్గుమాలని చర్యగా అభివర్ణించారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్ను వేధించి హింసించి చంపారన్నారు. ఎంఎల్‌సి అనంతబాబు డ్రైవర్ సుబ్రమణ్యంను హత్యచేసి డోర్ డెలివరీ చేశారనీ, మరోకడేమో దళిత యువకునికి గుండుగీయించారనీ, పులివెందులలో దళిత మహిళ నాగమ్మను హత్యాచారం చేశారనీ గుర్తుచేశారు. వైసిపి దళిత వ్యతిరేక పార్టీ అని చెప్పకనే వారి చేష్టలు రుజువు చేశాయని అన్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయి, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా వారి అరాచకాలకు అడ్డూ అదుపులేకుండా కొనసాగిస్తున్నారని, ఇలాంటి వారిని కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదన్నారు. భూమన కర్ణాకరరెడ్డి లాంటి వారి రౌడీయిజాన్ని అక్రమాలను కొనసాగనివ్వమని, వాటిని సహించే ప్రసక్తేలేదనీ హెచ్చరించారు. తిరుపతిలో దళితయువకునిపై కిరాతకానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని, భాదితునికి న్యాయం చేస్తామని తెలిపారు.

టైలర్ సంఘం జిల్లా కార్యదర్శి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-సి బెళగల్

టైలర్ సంఘం జిల్లా కార్యదర్శి టి.ఆదేన్న (39) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. గత పదిహేనేళ్లుగా టైలర్ సంఘంలో మండల సభ్యులు గా మండల అధ్యక్షులుగా రాణించి ఇటీవల జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగారు. టైలర్ సంఘానికి, సభ్యులకు ప్రభుత్వం నుండి అనేక సంక్షేమ పథకాల కోసం, అభివృద్ధి కోసం కృషి చేశారు. ఆయన గత వారం రోజుల క్రితం పచ్చ కామెర్లతో ఆసుపత్రిలో చేరినా కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలిసి టైలర్ సంఘానికి తీరని లోటు అని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు.

ఐదు రకాల బస్సుల్లో ప్రయాణం

- ఆర్‌టిసి కడప జోనల్ ఛైర్మన్ నాగరాజు

బస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న నాగరాజు

ప్రజాశక్తి - ఆదోని

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఈనెల 15 నుంచి అమల్లోకి వస్తుందని, మహిళలు ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రమంతా ఉచితంగా ప్రయాణించవచ్చని ఎపిఎస్‌ఆర్‌టిసి కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆదోని బస్ స్టేషన్‌ను సందర్శించి ప్రయాణికులతో నేరుగా మాట్లాడారు. బస్ స్టేషన్‌లో ఉన్న సౌకర్యాలను పరిశీలించి, రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌టిసి బస్టాండ్‌కిరువైపులా ప్రహరీకి ప్రతిపాదనలు పంపడం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. డిపో గ్యారేజ్ సందర్శనలో సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బస్టాండ్లో ఉన్న మహిళలతో ఉచిత బస్సు ప్రయాణంపై మాట్లాడగా మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు చెత్తరహితంగా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణను ఆదే శించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకట చౌదరి, యువ నాయకులు మారుతి నాయుడు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస ఆచారి, డిపో మేనేజర్ రఫిక్ పాల్గొన్నారు.

ఎంఇఒ రాజారామ్మోహన్‌కు ఘన సన్మానం


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, స్నేహితులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న రాజారామ్మోహన్ గత వారం జరిగిన ఉద్యోగోన్నతుల్లో భాగంగా పత్తికొండ ఎంఇఒగా ఉద్యోగోన్నతిని పొందారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టణ పిఇటిల ఆధ్వర్యంలో ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు వహాబ్‌లు కలిసి పూలమాలలు, శాలువా వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం రాజారామ్మోహన్ మాట్లాడారు. విద్యా వ్యవస్థను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు హనీఫ్, సుజనకుమారి, శిరీష, నర్సింహారాజు, వెంకటేష్, శ్రీను, రామన్న, బసవరాజు, శ్రీరామ్, ఈరన్న, ఆనంద్, స్కూల్ అసిస్టెంట్ చాంద్ బాష, ఎమ్మిగనూరు, పత్తికొండ మండలాల ఫైనాన్షియల్ క్లర్క్ ఇమ్రాన్, సత్య పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరయిన ఆర్థిక సహాయ చెక్కులను టిడిపి నాయకులు అందజేశారు శుక్రవారం దేవనకొండ గ్రామానికి చెందిన కాకర్ల మల్లేశ్వరికి రూ.25,541, బోయ నరసింహులుకు రూ.25,555ల చెక్కులను టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, టిడిపి సీనియర్ నాయకులు మలకన్న, మేజర్ పంచాయతీ సర్పంచి భర్త మాల బండ్లయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి సొంతంగా ఖర్చు పెట్టుకుని చికిత్స చేయించుకున్న వారు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షులు మస్తాన్, ఉపాధ్యక్షులు కుక్కల తిమ్మయ్య, రాజా సాహెబ్, వార్డు మెంబర్ వడ్డే గోవిందు, రాముడు, సుభాన్, బంగి రంగన్న, రహిమాన్, చాంద్, బడే సాహెబ్, టైపు హుస్సేని పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలల కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆదోని యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక అక్షరశ్రీ పాఠశాలలో గౌరవాధ్యక్షులు గోపాల్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గౌరవ సలహాదారులుగా కేశవ నారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అధ్యక్షులుగా నాగేంద్ర, ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తి, ఆర్థిక కార్యదర్శిగా దశరథ రాముడు, ఉపాధ్యక్షులుగా నాగరాజ్, హుస్సేనప్ప, హరి పాండురంగ, జాయింట్ కార్యదర్శులుగా అఫ్జల్ రెహమాన్, రమేష్ బాబు, వినోద్ రెడ్డి, సభ్యులుగా వెంకటేశులు, జనార్ధన్, రాజశేఖర్, నాగరాజ్, గోవిందరాజులును ఎన్నుకున్నారు. కరస్పాండెంట్లు మేఘనాథ్ రెడ్డి, తిప్పయ్య, రీనా పవిత్ర, రాము, హుస్సేనప్ప, కంబి రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి 'బహుమానం' బదిలీ

- అక్రమాలకు అడ్డుకట్ట వేసినందుకు రాజకీయ 'వేటు' - ఉరుకుంద ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు బదిలీ

ప్రజాశక్తి - కౌతాళం

విజయరాజు

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ రాజుపై బదిలీ వేటు పడింది. ఈ పుణ్యక్షేత్రంలో నిజాయితీగా పని చేస్తే రాజకీయ వేటు తప్పదని మరోసారి రుజువయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తి కాకముందే ఇద్దరు కమిషనర్లు బదిలీ అయ్యారంటే రాజకీయం ఎలా ఉందో అర్థమవుతుంది. కొందరి స్వార్థాలకు ఇలాంటి అధికారులు బదిలీ కావాల్సిందేనా..? స్వామి అంటూ భక్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

గత శ్రావణమాసం ముందు వచ్చిన మొదటి డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ పుణ్యక్షేత్రంలో మార్పులు చేపడితే ఆయననే మార్చేసి (బదిలీ) సత్తా చాటుకున్న వారు ఉన్నారు. ఉత్సవాల అనంతరం డిప్యూటీ కమిషనర్‌గా విజయరాజు బాధ్యతలు చేపట్టారు. అనతి కాలంలోనే స్థానిక అధికారులు, అర్చకుల సహకారంతో అభివృద్ధికి బాటలు వేశారు. స్వామివారి భక్తులను, అభివృద్ధి కోరే దాతలను గుర్తించి పుణ్యక్షేత్రంలో భక్తులకు ఎలాంటి సౌకర్యాలు అవసరం ఉన్నాయో..?, ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలో వారికి వివరించి రూ.కోట్లలో విరాళాలు రాబట్టి అభివృద్ధి పనులు ముమ్మరం చేశారు. పుణ్యక్షేత్రంలో ధ్వజస్తంభం ప్రతిష్టించి, గణపతి, లక్ష్మి అమ్మవారు, నవగ్రహాలు, యాగశాల నిర్మించి మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. హెలిక్యాప్టర్ ద్వారా పూల వర్షాన్ని కురిపించారు. డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి బెంగళూరుకు చెందిన భక్తుడు మంజునాథ రూ.1.80 కోట్లతో కోనేరు నిర్మాణానికి ముందుకొచ్చారు. శ్రీశైలం పుణ్యక్షేత్రంలో మాదిరిగా రూ.1.30 కోట్లతో రథం నిర్మాణానికి భక్తుడు ముందుకొచ్చారు. బళ్లారికి చెందిన భక్తుడు తిమ్మప్ప రూ.7 కోట్ల విలువ చేసే ఒక ఎకరా 11 సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారు. శ్రావణమాసోత్సవాల్లో భక్తులు సునాయాసంగా దర్శనం చేసుకునేందుకు ఫుట్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి భక్తుల మన్ననలు పొందారు. అన్నదాన సత్రంలో మూడు పూటల భోజన సౌకర్యం కల్పించారు. అన్నం, పప్పు, సాంబారు, గడ్డ పెరుగుతో కూడిన భోజనం అందించి భక్తుల మనస్సులు గెలుచుకున్నారు. దేవాలయం హుండీ ఆదాయం పెరగడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇంకా ఎన్నో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయించారు. బాధ్యతలు చేపట్టిన కొన్ని నెలలకే ఇంత అభివృద్ధి చేసిన విజయ రాజుపై బదిలీ వేటు పడడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అభివృద్ధి చేసే అధికారికి దేవదాయ శాఖ ఇచ్చే బహుమానం బదిలీనా..? పుణ్యక్షేత్రంలో నిధులు వృథా కాకుండా (రాజకీయ నాయకుల ఆదాయానికి గండి కొట్టినందుకు) ఆదాయం పెంచినందుకు రాజకీయ నజరానాగా ఆయనను 'బదిలీ' వరించింది..! ఇటీవల పుణ్యక్షేత్రానికి సంబంధించిన భూమి ఎంత ఉందో సర్వే చేశారు. 76 ఎకరాలు దేవాలయానికి చెందిన భూమి ఉన్నట్లు వెలుగు చూసింది. ఇందులో రెండెకరాల 75 సెంట్లు అధికార పార్టీకి చెందిన ఒక బడా రాజకీయ సామాజిక వర్గానికి చెందిన వారి ఆధీనంలో ఉన్నట్లు బయటపడింది. ఈ భూమి కొన్ని రూ.కోట్ల విలువ చేస్తుంది. డిప్యూటీ కమిషనర్ విజయ రాజు వల్ల భూమి ఎక్కడ చేజారుతుందోనని, ముందుగానే ఆలోచించి బదిలీ చేయించారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. డిప్యూటీ కమిషనర్ విజయరాజుకు దేవదాయ శాఖాధికారులు బదిలీ చేసినట్లు ఉత్తర్వులు జారీ కావడంతో చాలామంది భక్తులు అయోమయానికి గురవుతున్నారు.

విజయరాజు బదిలీని రద్దు చేయాలి

డిప్యూటీ కమిషనర్ విజయరాజు బదిలీని రద్దు చేయాలని కోరుతూ ఉరుకుంద, ఓబులాపురం, తిమ్మాపురం గ్రామాల ప్రజలు దేవాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు, మాజీ ఎంపిటిసి కురుగోడు, రవి, తదితరులు మాట్లాడారు. అభివృద్ధి పనులు చేసే అధికారిని బదిలీ చేయడంలో రాజకీయ కుట్ర ఉందన్నారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ ప్రమేయం ఉందని విమర్శించారు. రాజకీయంగా కక్ష కట్టి బదిలీ చేయించడం తగదన్నారు. 'ఇంటి దేవుడు' అని చెప్పే నాయకులు పుణ్యక్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఒకసారి చూడాలన్నారు. అభివృద్ధి చేస్తున్న అధికారిని ఎవరో చెప్పిన మాటలు విని బదిలీ చేయడం సమంజసం కాదన్నారు. తలనీలాల్లో కాంట్రాక్టర్ రాజు, మరి కొంతమంది కలిసి డబ్బులు ఖర్చు పెట్టి బదిలీ చేయించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయన బదిలీని రద్దు చేసి, ఇక్కడే పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిరసన చేపడుతున్న టిడిపి నాయకులు, గ్రామస్తులు

ఆలయానికి గద విరాళం

ప్రజాశక్తి - ఆదోని రూరల్

మండలంలోని జాలమంచి గ్రామం శ్రీసిద్ధాపురం ఆంజనేయ స్వామికి మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి 3 కిలోల వెండితో గదను శుక్రవారం విరాళంగా అందజేశారు. గదా విలువ సుమారు రూ.3.51 లక్షలు ఉంటుంది. అన్నదాన కార్యక్రమానికి తనవంతుగా రూ.10 వేల విరాళం అందజేశారు. వైసిపి సీనియర్ నాయకులు వీరేష్, శేఖర్, రంగారెడ్డి, నరసింహులు, దండు రామాంజనేయులు, నరేష్, వైసిపి పంచాయతీ రాజ్ విభాగం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కప్పట్రాళ్ల శాంత కుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం : మండలంలోని పాండవగల్లు గ్రామంలో శ్రీబాట లక్ష్మమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. లక్ష్మమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు.

గదను విరాళంగా అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

శ్రీమఠంలో ధ్వజారోహణతో ఆరాధన ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రుని సప్త రాత్రోత్సవాలను పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ధ్వజారోహణతో ప్రారంభించారు. శుక్రవారం శ్రీమఠం ముఖద్వారం ముందు గో, అశ్వ పూజలు నిర్వహించారు. అనంతరం యోగీంద్ర సభామండపంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 8 నుంచి 14 వరకు శ్రీరాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, రథోత్సవాలు జరుగుతాయని చెప్పారు. వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు అవార్డుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా వసతి, భోజన సదుపాయాలు, పోలీసు, శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బందితో తగిన భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.10 లక్షల విరాళం : శ్రీరాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.10 లక్షల విరాళం వచ్చినట్లు పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు పేర్కొన్నారు. కెనరా బ్యాంకు వారు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు రూ.10 లక్షలు అందించినట్లు తెలిపారు.

పుష్కరిణి ప్రారంభం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం నిర్వహణలో ఉన్న బృందావన గార్డెన్ అద్దె గదుల సముదాయం వద్ద నూతనంగా నిర్మించిన పుష్కరిణిని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ప్రకాష్ శెట్టి దాతృత్వంతో రూ.3 కోట్లతో నిర్మించిన పుష్కరిణిని శ్రీరాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా దాత ప్రకాష్ శెట్టితో కలిసి రిబ్బన్ కట్ చేసి పుష్కరిణి ప్రవేశం చేశారు. 175 అడుగుల పొడవు, 70 అడుగుల వెడల్పు, 7.5 అడుగుల లోతుతో పుష్కరిణి నిర్మాణం చేపట్టారు. స్వామివారి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా స్వామి వారికి తెప్పోత్సవం చేపట్టేందుకు శ్రీకారం చుట్టినట్లు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు తెలిపారు. శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేష్ జ్యోషి, సురేష్ కోనాపూర్, ద్వారపాలకులు అనంత స్వామి, ప్రకాష్ రావు, పవన్ కుమార్, కాంట్రాక్టర్ ఓబులయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీఠాధిపతులు

గోపూజ చేస్తున్న పీఠాధిపతులు

ఏర్పాటు చేసిన పుష్కరిణి

హమాలీ యూనియన్ వ్యవస్థాపక సభ్యులు మృతి

మల్లేష్ (ఫైల్)

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ హమాలీ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక సభ్యులు మల్లేష్ అనారోగ్యంతో మృతి చెందారు. మల్లేష్ మృతికి శుక్రవారం సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సిఐటియు సీనియర్ నాయకులు నాగేష్, మండల కార్యదర్శి అశోక్, మండల అధ్యక్షులు పాండురంగడు, యూనియన్ సీనియర్ సభ్యులు నెట్టికల్లు గడ్డం రంగన్న, అంబుజీ రంగన్న, మూలింటి రంగన్న, బండ్లయ్య, రంగడు, రంగన్న, బలరాముడు, కాంతయ్య, మహేష్, రమేష్, యూనియన్ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మల్లేష్ మృతి బాధాకరమని, ఆయన మృతికి సిపిఎం, సిఐటియు మండల కమిటీలు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో యూనియన్ ఏర్పాటులో మల్లేష్ కీలకంగా వ్యవహరించారని తెలిపారు.

రహదారి మధ్యలో గుంత

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కోటకొండకు వెళ్లే రహదారి మధ్యలో ఏర్పడిన గుంతను పూడ్చాలని గ్రామస్తులు, వాహన చోదకులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడారు. రహదారి మధ్యలో ఏర్పడిన గుంత వల్ల ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. ఆ రహదారి వెంట పి.కోటకొండ, బేతపల్లి, బంటుపల్లి, చెల్లెలచెలిమల, బండపల్లి, గుడిమిరాళ్ల, గుండ్లకొండ గ్రామాల ప్రజలు, వాహనదారులు నిత్యం ప్రయాణం చేస్తుంటారని చెప్పారు. అలాగే రైతులు పండించిన పంట ఉత్పత్తులను కోడుమూరు, కర్నూలు, ఆదోని వంటి పట్టణాలకు తరలిస్తుంటారన్నారు. గుంత ఏర్పడి ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి మధ్యలో ఏర్పడిన గుంతను పూడ్చాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న టి.సోమేష్ విద్యార్థి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంపయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 5న కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో హైజంప్ విభాగంలో తమ విద్యార్థి ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 9 నుంచి 11 వరకు గుంటూరు జిల్లా బాపట్లలో జరుగుతున్నాయని చెప్పారు. విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు అంపయ్య, ఉపాధ్యాయులు పాపన్న, బసవరాజు, రామదాసు, రామకృష్ణ, హరికృష్ణ అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

వేళకు రాని వైద్యులు

- ఇబ్బందులు పడిన రోగులు

ప్రజాశక్తి - ఆదోని

విధుల పట్ల కొందరికి అంకిత భావం కరువైంది. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి సేవలందించాల్సి ఉన్నా మొక్కుబడిగా విధులకు హాజరై దుమ్మా కొడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మురికివాడలో నివసిస్తున్న వారికి వైద్య సదుపాయం కల్పన దిశగా అర్బన్ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు తల్లి, బిడ్డ సంరక్షణ కోసం ఆస్పత్రులను ఏర్పాటు చేశారు. రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తూ సీజనల్ వ్యాధులు సోకకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండాలి. కొందరు విధులకు హాజరు కాకుండానే జీతాలు తీసుకుంటున్నట్లు విమర్శలున్నాయి.

పట్టణంలోని ఇందిరానగర్, అరుణ్ జ్యోతి నగర్, హనుమాన్ నగర్, శంకర్ నగర్, హవన్నపేట, షరాఫ్ బజారు ప్రాంతాల్లో అర్బన్ ఆస్పత్రులు ఉన్నాయి. వైద్యులు, ఫార్మాసిస్టు, టెక్నీషియన్, స్టాఫ్ నర్సు విధులు నిర్వర్తిస్తున్నారు. నామమాత్రంగా విధులు నిర్వర్తిస్తూ రోగుల పట్ల కనీస మర్యాద కూడా పాటించడం లేదని పలువురు వాపోతున్నారు. పట్టణంలోని రాయనగర్ ప్రాంతంలో ఉండే షరాఫ్ బజార్ అర్బన్ ఆస్పత్రి మధ్యాహ్నం 2 గంటలకే తాళం వేసి ఉంది. ఇందిరానగర్ అర్బన్ హెల్త్ ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యుడు లేరు. రెండు నెలలు గడుస్తున్నప్పటికీ రోగులకు సేవలు అందడం లేదు. ఇన్‌ఛార్జీ వైద్యునిగా శంకర్ నగర్ ఆస్పత్రి వైద్యులకు బాధ్యత అప్పగించినా ఆయన కన్నెత్తి చూడడం లేదని రోగులు వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒపి, రక్త పరీక్షలు చేయిస్తూ అవసరమైన గర్భిణులకు సెలైన్ ఎక్కించాల్సి ఉంది. వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య కూడా రోజురోజుకూ తగ్గుతోంది. వచ్చామా.. పోయామా అన్న రీతిలో ఆస్పత్రి సిబ్బంది వ్యవహరిస్తున్నారని, వారికి కేటాయించిన సమయం వరకు విధుల్లో ఉండడం లేదని రోగులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సక్రమంగా విధుల్లో ఉండి రోగులకు సేవలు అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాళం వేసిన ఆస్పత్రి

విధులకు దుమ్మా కొట్టడం తగదు

- వీరేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు

పట్టణంలోని అర్బన్ ఆస్పత్రుల్లో రోగులకు వైద్య సేవలు అందని ద్రాక్షలా ఉన్నాయి. పని నిమిత్తం శుక్రవారం 2 గంటలకు రాయ నగర్ సమీపంలో ఉండే షరాఫ్ బజార్ అర్బన్ ఆస్పత్రికి వచ్చాం. అక్కడ వైద్యులు, సిబ్బంది లేక ఆస్పత్రికి తాళం వేశారు. అక్కడ సమాధానం చెప్పేవారే లేరు. ఈ విషయాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ దృష్టికి తీసుకెళ్లాం. గంటలో తాళం తీయిస్తామని చెప్పినా అక్కడికి ఎవరూ రాలేదు. విధులు సక్రమంగా నిర్వర్తించేలా అధికారులు శ్రద్ధ చూపాలి. లేకపోతే ఆందోళన నిర్వహిస్తాం.

మధ్యాహ్నం వరకు విధులు నిర్వర్తించారు

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రఘురాం రెడ్డి

పట్టణంలోని షరాఫ్ బజార్ అర్బన్ ఆస్పత్రిని మధ్యాహ్నం వరకు తెరిచి ఉంచారు. జనరల్ సెలవు ఉండడం వల్ల మధ్యాహ్నానికే తాళం వేశారు. అక్కడ రెగ్యులర్ డాక్టర్ లేరు. హవన్నపేట అర్బన్ ఆస్పత్రి డాక్టర్‌కు ఇన్‌ఛార్జీ ఇచ్చాం. విషయాన్ని వారితో మాట్లాడి విధులకు సక్రమంగా హాజరయ్యేలా చూస్తాం.

ఆస్పరి సిఐ బాధ్యతల స్వీకరణ

సిఐ గంగాధర్

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి సిఐగా గంగాధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆస్పరి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిఐ మస్తాన్ వలీ కర్నూలు విఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సిఐ గంగాధర్ మాట్లాడారు. తాను చిత్తూరు, గోనెగండ్ల లో విధులు నిర్వహించానని, గోనెగండ్ల నుంచి కర్నూలు విఆర్‌కు వెళ్లి ఆస్పరి సిఐగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాల సమీపంలో మందుబాబులు తాగి విచ్చలవిడిగా సీసాలు పగులగొడితే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల్లో మట్కా, పేకాట ఆడితే తమ దృష్టికి తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బదిలీ సిఐ మస్తాన్ వలీకి సన్మానం : ఆస్పరి సిఐగా విధులు నిర్వహించి బదిలీపై విఆర్‌కు వెళ్లిన సిఐ మస్తాన్ వలీని పోలీసు సిబ్బంది శాలువా, పూలమాలలతో సన్మానించారు. సిఐ మాట్లాడుతూ... ప్రతి ఉద్యోగికీ బదిలీ సాధారణమని, ఎక్కడ విధులు నిర్వహించినా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా.. ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు. సిఐ గంగాధర్, ఎస్ఐ మన్మథ విజయ్, హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, అంజి, గిరిస్వామి, మల్లికార్జున, నరసింహులు, భాస్కర్ నాయుడు, రాము, నాగరాజు, చిట్టి బాబు పాల్గొన్నారు.

బదిలీ సిఐ మస్తాన్ వలీని సన్మానిస్తున్న సిబ్బంది

సదుపాయాలు కరువు..!

- జగనన్న కాలనీపై అధికారులు, పాలకుల నిర్లక్ష్యం

- ప్రజలకు తప్పని అవస్థలు - కాలనీ వైపు పడని కూటమి తొలి అడుగు

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో గల జగనన్న కాలనీపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీరు, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కాలనీ అభివృద్ధిలో కూటమి తొలి అడుగు కనిపించట్లేదని వీధి ప్రజలు విమర్శిస్తున్నారు.

తమ కాలనీపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీధిలోకి వచ్చి తమ సమస్యలను తెలుసుకున్న నాథుడే కరువని వీధి ప్రజలు మండిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలను అభివృద్ధి చేశామని.. రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలకు ప్రాధ్యానం ఇస్తూ గ్రామాలను అభివృద్ధి చేశామని కుటమి ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ప్రచారం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా తమ కాలనీ అభివృద్ధిలో కూటమి తొలి అడుగు ఒక ఇంచు కూడా పడలేదని విమర్శిస్తున్నారు. మౌలిక సదుపాయాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. రోడ్లు, డ్రెయినేజీ లేక ఇళ్ల ముందు నీరు నిలిచి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగునీటి కోసం చాలా దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉంది. రోడ్లు, డ్రెయినేజీ లేక కాలనీ చాలా దుర్భరంగా తయారైంది. ప్రజలు అవసరాలకు వాడుకుంటున్న మురుగునీరు, వర్షపు నీరు ఎక్కడికి వెళ్లే అవకాశం లేక ఇళ్ల ముందే నిలుస్తోంది. వర్షం కురిసి మోకాలు లోతు నీరు నిలిచి బయటకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. మురుగు నీరు నిలిచిపోవడం వల్ల దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నారు. వీధిలో నిలిచిన నీరు ఇళ్ల పునాదిలోకి దిగుతున్నాయి. దాని ద్వారా ఇల్లు నెమ్ము తీసుకుంటోంది. దానికి తోడు వీధిలో ముళ్లపొదలు మొలిచాయి. ముళ్ల చెట్ల వల్ల రహదారిలో తిరగడానికి కూడా వీలులేకుండా తయారయింది.


వీధిలో దట్టంగా మొలచిన ముళ్ల చెట్లు

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

- మంగలి విజయ్

వీధి దీపాలు సరిగా లేక రాత్రి వేళలో చిమ్మ చీకటిలో ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవిస్తున్నాం. స్తంభాలపై వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వందలసార్లు అధికారులకు తెలిపినా స్పందించడం లేదు. అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలి.

ముళ్లచెట్లను తొలగించాలి

- బోయ బాబు

వీధిలో చెట్లు మొలవడం వల్ల వీధి ప్రజలకు తిరగడానికి కూడా లేదు. కాలనీలో నీరు నిలిచి దుర్వాసన, దోమల స్వైర విహారం వల్ల రోగాలు ప్రబలుతున్నాయి. అధికారులు స్పందించి చెట్లను తొలగించి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపిడిఒ పుల్లయ్య



సంబంధిత అధికారులతో కలిసి కాలనీని సందర్శిస్తాం. అక్కడ ఏయే సమస్యలు ఉన్నాయో పరిశీలించి, ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకుంటాం. ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తాం.

రజకుల స్థితిగతులను మెరుగుపరచండి

- రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి

ప్రజాశక్తి - ఆదోని

బీసీ కులాల్లో వెనుకబడిన రజకుల ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి కోరారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రజకుల స్థితిగతులను మెరుగుపరచాలని, జిఒ 6, 27, 102లను అమలు చేయాలని కోరారు. ల్యాండ్రీలకు ఉచిత విద్యుత్‌ను 150 నుంచి 250 యూనిట్లకు పెంచాలని, 50 ఏళ్లకు పింఛను ఇవ్వాలని తెలిపారు. చెరువులు, దోభీఘాట్లపై శాశ్వత హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వాషర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ దేవాలయాల ట్రస్టు బోర్డుల్లో సభ్యత్వం కల్పించాలని కోరారు. ఆయన స్పందించి... వినతి పత్రాన్ని సిఎం కార్యాలయానికి పంపి స్పష్టంగా అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్లు చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, గోపి, రామాంజనేయులు, మెంటా రావు, ధర్మారావు ఉన్నారు.

బాల నాగన్న సేవలు మరువలేనివి : సిపిఐ

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా, కార్మిక సమస్యల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న బి.బాల నాగన్న సేవలు మరవలేనివని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు తెలిపారు. శుక్రవారం బాలనాగన్న 14వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయములో పట్టణ మండల సమితి ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ బాబు, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు టి.వీరేష్, కల్లుబావిరాజు మాట్లాడారు. ఈనెల 9, 10, 11వ తేదీల్లో సిపిఐ 24వ జిల్లా మహాసభలు కర్నూలు నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల సందర్భంగా 9న ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ నుంచి పాతబస్టాండ్ వరకు ప్రదర్శన ఉంటుందని, అనంతరం పున్నమి రెస్టారెంట్‌లో ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

- ఎస్ఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి - చిప్పగిరి

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు తెలుసుకొని నడపాలని, అతిక్రమించి నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం చిప్పగిరిలోని అంబేద్కర్ సర్కిల్‌లో వాహనాలను తనిఖీ చేస్తూ వాహనాలకు సంబంధించిన వాహన, లైసెన్సు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో ఏకాగ్రత అవసరమన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అతివేగం కూడా మంచిది కాదన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. రోడ్డు వెంట ఎవరైనా మద్యం సేవించడానికి కూర్చుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు వాహనాలకు జరిమానా విధించారు. ట్రైనింగ్ ఎస్ఐ రాజు కుళ్లాయప్ప, పోలీసులు షబ్బీర్, ఖాదర్ బాషా, శంకర్ పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

తల్లిపాలపై మెడికవర్‌లో అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి సంవత్సరం ఆగస్ట్ మొదటి వారం ప్రపంచ బ్రెస్ట్‌ఫీడింగ్ వారంగా జరుపుకుంటారు. ఇందులో 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రపంచ బ్రెస్ట్‌ఫీడింగ్ వారం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ స్త్రీలలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగిస్తోంది. తల్లిపాలు పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యానికి మూలస్తంభం అని వైద్యులు చెబుతున్నారు. తల్లిపాలలో ఉండే పోషకాలు, రోగనిరోధక శక్తి బిడ్డకు ఆరోగ్యవంతమైన జీవితం అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. తల్లి పాలతో పెరిగే శిశువులకు జీర్ణసమస్యలు తక్కువగా ఉండే అవకాశముంది. దీర్ఘకాలికంగా చూస్తే, డయాబెటిస్, ఊబకాయం, శ్వాస సంబంధిత సమస్యలు వంటి వ్యాధుల నుంచి బిడ్డను రక్షించగలదు. డాక్టర్ ఆర్ మురార్జీ, డాక్టర్ కె సింధూర రెడ్డి , కన్సల్టెంట్ పీడియాట్రిక్స్ అండ్ నియోనాటాలజిస్ట్ , డాక్టర్ శిల్పా చౌదరి పెద్దపొల్ల డాక్టర్ జ్యోత్స్న టి,కన్సల్టెంట్ ప్రసూతి వైద్యుడు అండ్ గైనకాలజిస్ట్ పాల్గొన్నారు. మెడికవర్ వైద్యులు మాట్లాడుతూ 'తల్లిపాలు బిడ్డకు ప్రాణదాయకం, పిల్లల శారీరక, మానసిక అభివృద్ధిలో తల్లిపాలు ఎంతో కీలకమైనవి. కనీసం 6 నెలల పాటు తల్లి పాలే ప్రధాన ఆహారంగా ఇవ్వడం శిశువు భవిష్యత్తు ఉంటుంది. తల్లిపాల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ వైద్యుల సందేశం ప్రతి సంవత్సరం ఆగస్ట్ మొదటి వారం ప్రపంచ బ్రెస్ట్‌ఫీడింగ్ వారంగా జరుపుకుంటారు. ఇందులో 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రపంచ బ్రెస్ట్‌ఫీడింగ్ వారం సందర్భంగా, మెడికవర్ హాస్పిటల్స్ స్త్రీలలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగిస్తోంది. తల్లిపాలు పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యానికి మూలస్తంభం అని వైద్యులు చెబుతున్నారు. తల్లిపాలలో ఉండే పోషకాలు, రోగనిరోధక శక్తి బిడ్డకు ఆరోగ్యవంతమైన జీవితం అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. తల్లి పాలతో పెరిగే శిశువులకు జీర్ణ సమస్యలు తక్కువగా ఉండే అవకాశముంది. దీర్ఘకాలికంగా చూస్తే, డయాబెటిస్, ఊబకాయం, శ్వాస సంబంధిత

తల్లిపాల అవగాహన కార్యక్రమంలో వైద్యులు, కస్టర్ హెచ్ వై.మహేశ్వర్‌రెడ్డి, తల్లులు

సమస్యలు వంటి వ్యాధుల నుంచి బిడ్డను రక్షించగలదు. డాక్టర్ ఆర్ మురార్జీ, డాక్టర్ కె సింధూర రెడ్డి , కన్సల్టెంట్ పీడియాట్రిక్స్ అండ్ నియోనాటాలజిస్ట్ , డాక్టర్ శిల్పా చౌదరి పెద్దపొల్ల డాక్టర్ జ్యోత్స్న టి.కన్సల్టెంట్ ప్రసూతి వైద్యుడు అండ్ గైనకాలజిస్ట్ పాలుగోన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ యజమాన్యం మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ప్రాణదాయకం, పిల్లల శారీరక, మానసిక అభివృద్ధిలో తల్లిపాలు ఎంతో కీలకమైనవి. కనీసం 6 నెలల పాటు తల్లి పాలే ప్రధాన ఆహారంగా ఇవ్వడం శిశువు భవిష్యత్తు ఆరోగ్యానికి బలమైన అడుగులుగా నిలుస్తుంది. తల్లులు నిస్సంకోచంగా పిల్లలకు పాలివ్వాలని మనమందరం ప్రోత్సహించాలి. మెడికవర్ హాస్పిటల్స్ ఈ వారంలో తల్లిపాలపై అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తూ, మాతృత్వాన్ని, శిశు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తూ మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై. మహేశ్వర్ రెడ్డి చేతుల ద్వారా పిల్లల తల్లులకి బేబీ కిట్స్ అందించారు.

అక్రమ మద్యం తయారీదారుని అరెస్ట్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అక్రమ మద్యాన్ని తరలిస్తున్న నిందితుడిని అరెస్టు చేశామని కర్నూలు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సిఐ కె.చంద్రహాస్ తెలిపారు. శుక్రవారం తమకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు కర్నూలు రూరల్ మండలం ఉల్చాల గ్రామ సెంటర్లో తలఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పద వాహనాన్ని ఆపి డాక్యుమెంట్లను పరిశీలించు నిమిత్తం చూడగా అందులో రెండు తెల్లని సంచులు కనిపించాయి. ఒక సంచిలో 100 బండిల్స్ ఉండి ఒక్కో బండి లు 100 సాచెట్లు కలిగి, అందులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సుమారు పదివేల ఖాళీ అమత్స్ సిల్వర్ కప్స్ రేర్ ఇండియన్ బ్రాందీ పేరుతో ఉన్న శాచెట్లు కనిపించాయి. మరో తెల్ల సంచిలో పది లీటర్ల నాటు సారా గుర్తించారు. విచారణలో సదరు వ్యక్తి పింజారి మిన్నెలగా గుర్తించారు. సదరు వ్యక్తి అక్రమ మద్యం తయారీ నిమిత్తం అధిక ఆదాయం లో భాగంగా హైదరాబాదులో గల అబ్దుల్ కలాం వద్ద సాచెట్లు, స్పిరిట్‌ను తనకు అమ్మేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు రూ.రెండు లక్షలు అబ్దుల్ కలాం కు చెల్లించి మొదటి విడతగా ఈ సరుకును కర్ణాటక రాష్ట్రానికి చెందిన చంద్రబాబు కారులో తరలిస్తూ మిన్నెల పట్టుబబడ్డాడు. మిన్నెలను అరెస్టు చేసి అతని వద్ద నుండి కారును,

అక్రమ మద్యం తయారీ దారుని నుంచి స్వాధీనం చేసుక్కు మధ్య, కారు, ఇతరములు

పదివేల సాచెట్లు, 10 నాటు సారాయి బాటిళ్లు, సెల్ ఫోను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తయారు చేయడం, అమ్మడం చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని సిఐ చంద్రహాస్ హెచ్చరించారు.

బస్టాండ్ కిటకిట

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వరుస పండగ సెలవులు వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమితో పాటు ఆదివారం సెలవు రావడంతో ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళ్లి తమ కుటుంబ సభ్యులతో కలిసి పండగ చేసుకోవడానికి వెళ్తున్నారు. అక్కలు చెల్లెళ్లు తమ అన్న తమ్ముళ్లకు రాఖీ కట్టి అన్నాచెల్లె బంధాన్ని గుర్తు చేసేందుకు, ఆనందంగా గడిపి వచ్చేందుకు బయలుదేరడంతో కర్నూలు బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఏ బస్సు వచ్చినా బస్సులో సీట్ల కోసం ప్రయాణికులు పరుగులు తీస్తున్నారు. ఆర్‌టిసి ప్రయాణం సుఖమయం శుభప్రదం అని భావించి ఆర్‌టిసి బస్సులోనే ప్రయాణం చేసేందుకు ప్రజలు బారులు తీరారు. కర్నూలు ఆర్‌టిసి బస్టాండు ఎక్కువగా ఆడపడుచులతో, పిల్లలతో కలకలలాడింది. ప్రయాణికులకు అనుగుణంగా ఎపిఎస్‌ఆర్‌టిసి అధికారులు బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు కష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు సంతోషంగా పెళ్లి తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆశిద్దాం.

అసంపూర్తి పనులతో ప్రారంభానికి నోచని వైనం

ప్రజాశక్తి-సి బెళగల్

వైసిపి ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణాలకు పెద్ద పీటనే వేసింది. అందులో కొత్తకోటలో చేపట్టిన ఆయుష్మాన్ భవనం పెరుగుతున్న సిమెంట్ ధరలకు, స్టీల్ కు, లేబర్ ఛార్జీలకు కేటాయించిన నిధులు ఏ మాత్రం సరి పోక అర్ధాంతరంగా ఆగిపోయింది. ఇక్కడే కనీసం పూర్తి స్థాయిలో బిల్లులు రాబట్టుకోనేందుకు మాత్రం గుత్తెదారుడు అన్నీ పనులు పూర్తి అయినట్లు పైకి అలంకారంగా హంగులు వేశారు. కానీ అలంకార ప్రాయంగానే దర్శనమిస్తోంది. అధికారులు కూడా బిల్లులు సకాలంలో చెల్లిస్తామని చెప్పి గుత్తేదారుడితో ఇలా అసంపూర్తిగా హడావుడిగా పనులు చేయించి ఆ తర్వాత చేతులేతేశారు. దీంతో లోపల విద్యుత్ వైర్ల పని, మరుగుదొడ్లు, తాగు నీటి సౌకర్యం,రోగులకు, వైద్య అధికారులకు, సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్ , వైద్యురాలు కోసం లోపలే ఒక క్వార్టర్ నివాసంలో కొరవడిన పనులు, పలు విధంగా నిలిచి పోయి వృధాగా ఉన్నది. టిడిపి ప్రభుత్వంలో చివరిగా అవసరమైన రూ.4.5 లక్షల నిధులు కేటాయిస్తామని చెప్పి చివరికి బుకాస్తున్నారు. ఫలితంగా ప్రారంబానికి నోచుకోక ప్రజా ఆశయం నీరుగారి పోతుంది. ఇప్పటికైనా యంత్రాంగం దృష్టి సారించాలని పలువురు కాక్షిస్తున్నారు.

చీరలు , యూనిఫామ్ పంపిణీ చేస్తున్న సర్పంచి సుహాసిని, తదితరులు

చీరలు, యూనిఫామ్ పంపిణీ

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గద్దల రాజకుమార్ తల్లి కీర్తిశేషులు గద్దల శాంతమ్మ 25వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పారిశుధ్య కార్మికులకు చీరలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. సర్పంచి బండారు సుహాసిని, మాజీ సర్పంచి కొత్తపేట వెంకటేశ్వర్ రెడ్డి, వైసిపి జిల్లా ఎస్సీ అధ్యక్షులు ఆర్ . వెంకటేశ్వర్లు, పాస్టర్ చెరువు ఆనంద్ పంచాయతీ కార్యాలయం లో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందికి చీరలు, పురుషులకు యూనిఫాం వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు పారిశుధ్య పనులు చేస్తూ తీవ్రమైన దుర్గంధాల నుంచి ప్రజలను కాపాడుతూ విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరూరు భాస్కర్, ఎడవల్లి అంజి, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వొకేషనల్ ప్రిన్సిపల్ కు థెరిసా సేవ పురస్కార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మైక్స్ ఇంటర్నేషనల్ , నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ సంస్థ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యస్.నాగస్వామి నాయక్ కు 'ఇంటర్నేషనల్ మదర్ థెరిసా సేవ పురస్కార్ ' అవార్డును శుక్రవారం ఇ-మెయిల్ ద్వారా అందజేశారు. మార్చి 2025 లో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో కళాశాల విద్యార్థులు 82.02 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు అవార్డును అందజేశారు.. ఈ సందర్భంగా కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపల్ ను అభినందించారు.

దళితులను హింసించడం వైసిపి నైజం

-దాడికి పాల్పడిన కిరాతకులను వదిలిపెట్టం

-టిటిడి పాలకమండలి సభ్యులు రాజశేఖర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

దళితుల పై దాడి చేయడం వైసిపి నైజం అని, తిరుపతి ఘటనతో అది మరో రుజువైందని టిడిపి పాలకమండలి సభ్యులు, నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షులు పుల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, కెడిసిసిఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు వెంకయ్యపల్లి, ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ బేతం కృష్ణుడుతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ తిరుపతిలో భూమన కర్ణాకరరెడ్డి కుటుంభం, వైసిపి అనుచరులు దళిత యువకునిపై దాడిచేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి కార్యాలయంలో వైసిపి రౌడీలు ఒక దళిత యువకుడిని బంధించి, స్పృహ కోల్పోయే వరకు క్రూరంగా కొట్టారని అన్నారు.

ప్రెస్ క్లబ్ లో మొక్కలు నాటిన జర్నలిస్టులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ప్రెస్ క్లబ్ ఆవరణంలో శుక్రవారం మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ గుప్తా, నీలం సత్యనారాయణ ఫోటో జర్నలిస్టు నాయకులు విజయ్ కరణ్, యూజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ఆవరణంలో మొక్కలు నాటారు. త్వరలోనే ప్రెస్ క్లబ్ అందరికీ అందుబాటులోకి రానుందని వారు పేర్కొన్నారు.

ముగిసిన రిజిస్ట్రార్ పదవి కాలం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగర శివారులోని జగన్నాథ గట్టు సమీపంలో ఉన్న ట్రిపుల్ ఐటీ డిఎం విద్యాసంస్థ రిజిస్ట్రార్ కె.గురుమూర్తి పదవి కాలం శుక్రవారం నాటికి ముగిసింది. కేంద్ర ప్రభుత్వ సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ డిప్యూటేషన్ మీద ఇక్కడికి వచ్చిన ఆయన దాదాపుగా మూడేళ్ల పాటు కొనసాగారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను విద్యాసంస్థ డైరెక్టర్ బిఎస్ మూర్తి కొనియాడారు. విద్యా సంస్థ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని పేర్కొన్నారు.